# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 2 ఆగస్టు 2024 | KAMAREDDY




మోర్తాడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



బోధన్‌లో బీఆర్ఎస్ నాయకుడు రజాక్ ఇంటి నుంచి సీఎం దిష్టిబొమ్మను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



## నిరసన గళం
## భగ్గుమన్న జనం

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మహిళా ఎమ్మెల్యేల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలపై గురువారం ఉమ్మడి జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ పిలుపు మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై రేవంత్, భట్టి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. బోధన్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను తయారు చేస్తుండగా, పోలీసులు వచ్చి దాన్ని లాక్కెళ్లిపోయారు. కామారెడ్డి, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ, సదాశివనగర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీమ్‌గల్‌లో సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు.

– కామారెడ్డి / బోధన్, ఆగస్టు 1



బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- నిజాంసాగర్ పీహెచ్‌సీ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్



నాగన్న బావి వద్ద పనులను పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిజాంసాగర్/ లింగంపేట, ఆగస్టు 1: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ హెచ్చరించారు. నిజాంసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. జూలై 27వ తేదీ నుంచి విధులకు హాజరుకాని జూనియర్ అసిస్టెంట్ సుభాష్‌ను సస్పెండ్ చేశారు. విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ల్యాబ్ టెక్నిషియన్ నవ్యశ్రీని సంజాయిషీ కోరారు. దవాఖానలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను వైద్యాధికారి రోహిత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, బాన్సువాడ ఆర్డీవో రమేశ్‌రాథోడ్, ఎంపీడీవో, తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

**పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి..**

నాగన్న బావి వద్ద పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్ఫోసిస్ వైస్ చైర్మన్ కల్పానా రమేశ్, వాత్సల్యతో కలిసి పనులను పరిశీలించారు. కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి నాగన్న బావి వరకు ఉపాధి హామీ పథకం నిధులతో రహదారి నిర్మాణం చేపట్టాలన్నారు. రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని, బావికి నాలుగు వైపులా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 15వ తేదీలోగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్‌వెంట పంచాయతీరాజ్ డీఈఈ గిరిధర్, ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్, ఏపీవో అన్నపూర్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు ఎల్లమయ్య, కౌడ రవీందర్, అశోక్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.


- పాల బిల్లులు చెల్లించని విజయ డెయిరీ
- నాలుగు నెలలుగా పైసా కూడా ఇవ్వని వైనం
- 15 రోజులకోసారి చేయాల్సిన చెల్లింపులు
- రూ.కోటికి పైగా పేరుకుపోయిన బకాయిలు
- రేవంత్ సర్కారు వచ్చినప్పటి నుంచి ఇదే కథ
- రైతుల గోడు పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

# పాడి రైతుకు ‘కోటి’ కష్టాలు



విజయ డెయిరీకి పాలు పోసే పాడి రైతుల కష్టాలు రెట్టింపయ్యాయి. పాల బకాయిలు రూ.కోటికి పైగా పేరుకు పోయాయి. పదిహేను రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సిన ప్రభుత్వం.. నాలుగు నెలల నుంచి పైసా విదల్చలేదు. కేసీఆర్ హయాంలో ప్రోత్సాహకాలు ఇచ్చి మరీ పాడి రైతులను ప్రోత్సహించారు. కానీ రేవంత్ సర్కారు వచ్చాక వారిని పట్టించుకున్న వారే లేరు. నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించక పోవడంతో రూ.కోటికి పైగా బకాయిలు పేరుకుపోయాయి. బిల్లుల కోసం చివరకు రోడ్డెక్కినా స్పందించే వారే కరువయ్యారు. దీంతో పాడి రైతులు ఆగమవుతున్నారు.

– నిజామాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)




## గతంలో ఠంచన్‌గా..

ప్రభుత్వ ఆధీనంలో నడిచే విజయ డెయిరీ ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది రైతుల నుంచి పాలను సేకరిస్తుంది. ఇలా సేకరించిన పాలతో పాల ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తుంటుంది. కేసీఆర్ సర్కారు హయాంలో పదిహేను రోజులకోసారి కచ్చితంగా బిల్లులు చెల్లించేవారు. అంతేకాదు, అప్పటి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తూ పాడి రైతులకు అండగా నిలిచేది. అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రోత్సాహకాలు లేకపోయినా, పోసిన పాలకు సకాలంలో డబ్బులైనా చెల్లించాలని కోరుతున్నారు.

## అప్పుల ‘పాలు’

పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడిన రైతులు విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్నారు. బ్యాంకుల్లో, మహిళా సంఘాల్లో, వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేసి వారు పశువులు కొనుగోలు చేశారు. అప్పులకు కిస్తీలు క్రమం తప్పకుండా కట్టాల్సి ఉంటుంది. పశువులకు దాణా, మిండ్రాల్ మిక్చర్, కాల్షియం, మందులు, కూలీలకు వేతనాలు తదితరాలకు డబ్బులు అవసరముంటాయి. విజయ డెయిరీ నుంచి చెల్లింపులు సరిగా జరుగకపోవడంతో వారంతా డబ్బుల్లేక ఆందోళన చెందుతున్నారు. చివరకు అప్పు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు. సూక్ష్మ రుణాలనే ఎక్కువ మంది ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో మైక్రో ఫైనాన్స్ వ్యాపారులు రోజూ ఉదయమే ఇంటికొచ్చి డబ్బులు అడుగుతారు. ప్రభుత్వం నుంచి పైసల్ రాకపోవడంతో వారికి మొఖం చూపించలేక రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వడ్డీ వ్యాపారులకు చెల్లించాల్సిన కిస్తీలను కట్టేందుకు మరింత అప్పు చేయాల్సి వస్తోంది. సమయానికి డబ్బులు రాక వడ్డీలకు వడ్డీలు కడుతూ పాడి రైతుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పెండింగ్ బిల్లులపై విజయ డెయిరీ అధికారుల వివరణ కోరేందుకు యత్నించగా స్పందించేందుకు వారు నిరాకరిస్తున్నారు.

## నాలుగు బిల్లులు పెండింగ్?

నిజామాబాద్ జిల్లాలో సుమారు 8 వేల మంది రైతుల పేర్లు విజయ డెయిరీలో నమోదై ఉన్నాయి. ఇందులో 4500 మంది మాత్రమే సెప్టెంబర్ – ఫిబ్రవరి మధ్య సీజన్‌లో పాలను విక్రయిస్తున్నారు. అన్‌సీజన్‌గా భావించే మార్చి – ఆగస్టు మధ్య కాలంలో 2 వేల మంది మాత్రమే విజయ డెయిరీకి పాలు పోస్తుంటారు. ఇందుకు గాను 15 రోజులకోసారి బిల్లులు చెల్లిస్తారు. కానీ నాలుగు నెలల నుంచి డబ్బులు రావట్లేదు. జిల్లాలో 5 వేల మంది పాడి రైతులకు నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే అక్షరాల రూ.కోటి దాకా బకాయిలు పేరుకు పోయాయి. కాంగ్రెస్ గద్దెనెక్కాక పాడి రైతులను పట్టించుకున్న వారే లేరు. విజయ డెయిరీ అధికారుల తీరు కూడా మారిపోయింది. పాలను సేకరించి ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలించి, తయారుచేసిన పాల ఉత్పత్తులను జోరుగా విక్రయించేవారు. ఇప్పుడా జోష్ లేకుండా పోయింది. బకాయిలపై డెయిరీ అధికారులను ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వడం లేదు సరికదా రైతులపైనే రుసరుసలాడుతుండడం గమనార్హం.

### రూ.40 వేలు రావాలే..

విజయ డెయిరీకి రోజూ పాలు పోస్తాను. గతంలో చెల్లింపులు సరిగ్గా జరిగేవి. కొద్ది రోజులుగా పేరుకు పోతున్నాయి. నాకు రూ.40 వేలు రావాలి. మాకు న్యాయంగా రావాల్సిన డబ్బులు ఇవ్వకపోతే మేమెట్లా బతకాలి. మూగ జీవాలను ఎట్లా సాదేది. పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**- సుబ్బలక్ష్మి, మహిళా రైతు, కోటగిరి**



### దాణా కొనడానికి ఇబ్బందిగా ఉంది..



మునుపు ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లులు వచ్చేవి. ఈమధ్య పైసలే వస్త లేవు. రోజులు గడుస్తున్నా బిల్లులు ఇయ్యక పోతే మేం ఎట్లా బతికేది. పశువులకు దాణా కొనడానికి ఇబ్బంది అవుతున్నది. విజయ డెయిరీ నుంచి నాకు రూ.50వేల వరకు డబ్బులు రావాలి. పాడి రైతులను వేధించడం సరికాదు.

**- ప్రశాంత్, పాడి రైతు, కోటగిరి**



సిరికొండ సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు, రైతులు

## అందరికీ మాఫీ చేయాల్సిందే..

సిరికొండ, ఆగస్టు 1 : కటాఫ్ డేట్ లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేస్తూ సిరికొండలోని సొసైటీ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రతినిధులు రామకృష్ణ, రమేశ్, దామోదర్, బాబన్న, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ.. కొందరికే హ్యాపీ

- వేలాది మందికి వర్తించని పథకం
- ఎందుకు కాలేదో తెలియక రైతాంగం సతమతం
- బ్యాంకులు, ఆఫీసుల చుట్టూ చక్కర్లు
- సర్కారు తీరుపై అన్నదాతల విసుర్లు



రుణమాఫీ కాలేదని గురువారం కోటగిరి రైతువేదికకు వచ్చి ఆరా తీస్తున్న రైతులు.. ఆన్‌లైన్‌లో వివరాలు చెక్ చేస్తున్న ఏఈవో

బోధన్ రూరల్/ నాగిరెడ్డిపేట, ఆగస్టు 1: రుణమాఫీ ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. రెండో విడుతలోనూ అర్హులైన వేలాది మందికి నిరాశే మిగిలింది. రెండు విడుతల్లో కలిపి రూ.లక్షన్నర లోపు పంట రుణాలు మాఫీ చేస్తున్నట్లు సర్కారు ప్రకటించింది. కానీ కొందరికే మాఫీ వర్తించగా, చాలా మందికి ఆశభంగమే ఎదురైంది. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే లక్షన్నర కాదు కదా.. రూ.30–40 వేల లోపు ఉన్న చాలా మంది రైతుల లోన్లు మాఫీ కాలేదు. పట్టా పాస్‌బుక్, ఆధార్, రేషన్ కార్డు వివరాలన్నీ సరిగా ఉన్నప్పటికీ వారి పేరు జాబితాలో లేదు. దీంతో ఏం చేయాలో తోచక బ్యాంకులు, ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అటు బ్యాంకర్లు, ఇటు అధికారుల నుంచి సరైన సమాధానం దొరకక, కాంగ్రెస్ పాలనలో గిట్లనే ఉంటుందని నిరాశగా వెనుదిరుగుతున్నారు.

### గందరగోళంగా ఉన్నది



రుణమాఫీ రెండో జాబితా అంతా గందరగోళంగా ఉన్నది. నాకు ఎకరం 20 గుంటల పొలం ఉన్నది. నేను రూ.లక్ష లోన్ తీసుకున్న. లక్షన్నరలోపు ఉన్న వారికి మాఫీ అని చెప్పింన్రు. కానీ అధికారులు ఇచ్చిన లిస్టులో నా పేరు లేదు. మాఫీ వస్తాదో.. రాదో అర్థమైతలేదు.

**- రాము, రైతు, కల్దుర్కి, బోధన్ మండలం**

### ఏం చేయాలో అర్థమైతలేదు..

మోస్రా కెనరా బ్యాంక్‌లో రుణం తీసుకున్న. నాలోన్ రూ. లక్ష పైన ఉన్నది. రెండో జాబితాలో పేరు ఉందోమేనని చూస్తే లేదు. లోన్ మాఫీ అయితుందని మస్తు ఆశపడ్డ. కానీ లిస్టులో పేరు రాకపోవడం బాధగా ఉన్నది. రుణమాఫీ చేయాలి.

**-అబ్దుల్ దారు, రాజీవ్‌నగర్ తండా, బోధన్ మండలం**



### సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మాఫీ కాలే..



మాకు ఏడెకరాల భూమి ఉన్నది. నా భార్య, నా పేరుపైన రెండు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నాం. నా రేషన్ కార్డుపై ఆత్మకూర్ గ్రామ మహిళ పేరును సొసైటీ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో నాకు రుణమాఫీ రాలేదు. అధికారులు చుట్టూ తిరిగినా స్పందించడం లేదు. మా గ్రామంలో 160 కుటుంబాలకు నాగిరెడ్డిపేట కో–ఆపరేటివ్ బ్యాంకు, ఎల్లారెడ్డి ఎస్బీఐలో రుణాలు ఉన్నాయి. ఇప్పటిదాకా 50 మందికే మాఫీ వచ్చింది.

**- చిలుకూరి కరుణాకర్‌రెడ్డి, రైతు, వెంకంపల్లి**

## వర్గీకరణ సంబురాలు



బాన్సువాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నేతల సంబురాలు

**దశాబ్దాల కల నెరవేరిన వేళ ఎస్సీ, ఎస్టీల్లో ఆనందం వెల్లువెత్తింది.** ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు గురువారం వెల్లడించిన చారిత్రాత్మక తీర్పు దళిత, గిరిజన వర్గాలను సంతోషంలో ముంచెత్తింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలు సంబురాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలకు ఫలితం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి, బాన్సువాడ, మాచారెడ్డి, భిక్కనూరు, బోధన్, సిరికొండ తదితర ప్రాంతాల్లో సంబురాలు జరుపుకొన్నారు.





